క్లుప్తంగా

నియామకం


ఎండీ యాకూబ్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్‌ను ఆల్ ఇండియా పస్మాండ దళిత్ ముస్లిం ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయస్థాయి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫకీర్ జహంగీర్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టినందుకు యాకూబ్ కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక


చింత బాబు

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత బాబు, ఉపాధ్యక్షులుగా బొడిగె తిరుపతి, పొన్నం రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా చింత యుగందర్, సహాయ కార్యదర్శిగా బొడిగె అనిల్, కోశాధికారిగా దుద్దుల రాజేష్, సహాయ కోశాధికారిగా బొడిగె లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా బొడిగె రమేష్, పొన్నం రమేష్, బుర్ల రాజు, బుర్ల రమేష్ ఎన్నికయ్యారు.

రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్..



నర్సంపేట రూరల్ : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ చెన్నారావుపేట మండల కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి అంజద్‌ఖాన్ బుధవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా గుగులోత్ వీరన్న, గౌరవాధ్యక్షుడిగా ఎర్రబోయిన రవీందర్, కార్యదర్శిగా విజయశంకర్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అంకుష్, గుగులోత్ అశోక్, కోశాధికారిగా తెప్ప చిరంజీవి, ప్రచార కార్యదర్శిగా ధరావత్ సంతోష్, సహాయ కార్యదర్శులుగా ధరావత్ సంతోష్, బక్కి రాజేందర్, దేడల రాజు, కార్యవర్గ సభ్యులుగా ఒగ్గుల నరేందర్, గంధం దేవేందర్, సామంతుల రాకేష్, దార్ల నర్సింహస్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన అల్లాడి చిన్న భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా బుధవారం కాలనీవాసులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.12వేల ఆర్థికసాయం అందించారు.

నర్సంపేట : నర్సంపేటలోని పదో వార్డుకు చెందిన సాంబారి సత్యం బుధవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాంగ్రెస్‌లో చేరికలు



నెక్కొండ : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగివేసారిన నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తారన్నారు. కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జక్కుల సారయ్య, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సింగారపు తరుణ్, గాలి రాజు, సింగారపు అనిల్, జక్కుల శ్రీనివాస్, సింగారపు దిలీప్ పార్టీలో చేరగా రంజిత్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, చెన్నకేశవులు, కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, కొండల్‌రెడ్డి, రాజు, సురేందర్, వెంకన్న, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

లింగగిరి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు..



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మాదారపు మనోహర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చెన్నారావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిళి వెంకట్‌రెడ్డి, మంద యాకయ్య గౌడ్, తప్పెట రమేష్, మాదారపు చరణ్ కుమార్, మండల సోమయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎండు ఆకు తెగులుతో దిగులు

- పాకాల ఆయకట్టు పరిధి వరిపంటకు సోకిన తెగులు
- ఆందోళనలో అన్నదాతలు


ఎండు ఆకు తెగులు సోకిన వరిపైరు

ఖానాపురం : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా లభించక అష్టకష్టాలు పడుతూ పంటలను కాపాడుతున్న అన్నదాతలకు తెగుళ్లు దడ పుట్టిస్తున్నాయి. పంటంతా తెగుళ్ల బారిన పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు సందర్శించి నివారణకు సూచనలివ్వాలని వారు కోరుతున్నారు.

ధాన్యాగార కేంద్రంగా గుర్తింపు పొందిన పాకాల ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో వరిపైరు సాగుచేశారు. ఆయకట్టు కింద భారీగా సన్నరకాలను రైతులు సాగు చేసుకున్నారు. మొదట్లో యూరియా కోసం ఇబ్బందులు పడుతు పంటలను కాపాడుకున్నారు. ప్రస్తుతం పంటకు ఆశిస్తున్న తెగుళ్లతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు. వరి పంటకు భారీగా ఎండు ఆకు తెగులు సోకడంతో పంట ఎదుగుదల ఆగిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకాల ఆయకట్టు పరిధిలో ఎండు ఆకు తెగులు సోకిన పంటపొలాలను వ్యవసాయ అధికారులు సందర్శిస్తే రైతులకు లాభం చేకూరుతుందని వాపోతున్నారు. సుమారు 5 నుంచి 7 వేల ఎకరాల్లో ఎండుఆకు తెగులు సోకినట్లు రైతులు చెబుతున్నారు.

నివారణ చర్యలు ఇలా..

వరిపైరులో ఎండు ఆకు తెగులు నివారణకు సూచనలు పాటిస్తే తగ్గిపోయే అవకాశం ఉంది. వరి పంటలో తెగుళ్లు రాకముందు సూడోమోనాస్ లీటరు నీటికి 10 గ్రాములు పిచికారీ చేసుకోవాలి. తెగుళ్లు సోకిన పంటలో ఓ మడి నుంచి మరో మడి, పొలంలోకి నీళ్లు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాగే కాపర్‌ఆక్సీ క్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు, ప్లాంటోమైసిన్ 70 నుంచి 90 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయడం మంచిది. నత్రజని ఎరువులు వారం రోజుల పాటు నిలిపి వేయాలి. పొలం గట్లను వెంటనే కలుపు లేకుండా శుభ్ర పర్చుకోవాలి.

నాలుగు ఎకరాలకు తెగులు సోకింది



పాకాల పరిధిలో 20 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఇందులో నాలుగు ఎకరాల్లో ఎండు ఆకు తెగులు సోకింది. పంట మొత్తం ఎండిపోయి కనిపిస్తోంది. పంటలో తెగుళ్లను నివారించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పంటలపై పెట్టిన పెట్టుబడి వస్తుందో..రాదో తెలియని పరిస్థితి ఉంది. వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయి.

\- వల్లెపు శ్రీనివాస్, రైతు, పెద్దమ్మగడ్డ

అవగాహన కల్పిస్తున్నాం..



పాకాల ఆయకట్టు పరిధిలో వరిపంటకు ఎండు ఆకు తెగులు సోకుతున్న విషయం వాస్తవమే. రైతులకు ఎప్పటికప్పుడు నివారణ సూచనలు చేస్తున్నాం. తెగులు సోకిన పొలంలో రైతులు కాపర్‌ఆక్సీ క్లోరైడ్, ప్లాంటామైసిన్ మాత్రమే పిచికారీ చేసుకోవాలి. ఇతర మందులను వాటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల నివారణ ఇబ్బందికరంగా ఉంటుంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తెగుళ్ల నివారణ చేసుకోవాలి.

\- బోగ శ్రీనివాస్, ఏఓ, ఖానాపురం

నేటినుంచి నామినేషన్ల స్వీకరణ

రాయపర్తి : మొదటి విడతలో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానానికి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేటినుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ గుగులోత్ కిషన్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 ఎంపీటీసీ, 1 జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నేడు 10:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషలన్లు దాఖలు చేయవచ్చని, ఈనెల 11వరకు చివరితేదీ అన్నారు. 12న నామినేషన్ల పరిశీలన, అదేరోజు సాయంత్రం చెల్లుబాటు అయ్యే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 13న అప్పీళ్లు, 15న మధ్యాహ్నం 3గంటలలోపు అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ ఉంటుందన్నారు. ఈనెల 15న 3గంటల తర్వాత పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. ఈనెల 23న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు, నవంబర్ 11న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సంగెం : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఎ.వంశీకృష్ణ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున హెడ్‌కానిస్టేబుల్ ఖాసీం, కానిస్టేబుళ్లు, కార్తీక్, రాజుతో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని లోహిత వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుకను సంగెం, వరంగల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన బూర రాజు, కడారిగూడెం గ్రామానికి చెందిన మంద కుమార్, ఇల్లంద గ్రామానికి చెందిన అంబి రాజేంద్రప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్క కాటును నిర్లక్ష్యం చేయొద్దు

నర్సంపేట రూరల్ : కుక్క కాటును నిర్లక్ష్యం చేయొద్దని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సరోజ అన్నారు. పీహెచ్‌సీలో కుక్క, కోతి కాటు బాధితులకు బుధవారం అవగాహన కల్పించారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసిన గౌడ సంఘం సభ్యులు

సంగెం : ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.అరుణ్‌కుమార్‌ను హనుమకొండలోని ఎక్సైజ్ కార్యాలయంలో మండలంలోని గవిచర్ల గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు గుళ్లపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను, సీఐను కలిశారు. సంఘం సభ్యులు, శ్రీధర్ పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ బోనాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామంలో జోగిని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బద్ది పోచమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన బద్ది పోచమ్మతల్లి ఆలయానికి డప్పుచప్పుళ్ల నడుమ బోనాలు తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు.

పరిహారం చెక్కులు ఇవ్వాలి

నల్లబెల్లి : రైతులకు యాసంగి ధాన్యం బోనస్, పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి బుధవారం పత్రిక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటల చెప్పి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

జెడ్పీటీసీ టికెట్ కేటాయించాలి

గీసుకొండ : బొడ్డుచింతలపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేదాసి మోహన్‌కు జెడ్పీటీసీ టికెట్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నమిండ్ల చిన్నస్వామి కోరారు.

సర్వీస్ బుక్స్ పంపిణీ

పర్వతగిరి : డీఎస్సీ–2024ద్వారా మండలంలో నియామకమైన 15మంది ఉపాధ్యాయులకు బుధవారం ఎంఈఓ గాయపు లింగారెడ్డి సర్వీసు బుక్స్ అందజేశారు. ఏనుగల్ పీఎస్ హెచ్ఎం మల్‌సూర్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భూక్య రాములు, ప్రధాన కార్యదర్శి మేడిద నాగేశ్వరరావు, మహమ్మద్ మదార్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



రాయపర్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బుద్ధ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీఆర్సీ జన్నపురెడ్డి రాజిరెడ్డి, గారె నర్సయ్య, క్లబ్ నాయకులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఎండీ నయీం, బుద్ధ సుప్రియ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులను ఖండించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర నాయకుడు పంజాల రమేష్, సీపీఎం రాష్ట్ర నాయకుడు కె.కుమారస్వామి, జనగాం కుమారస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో విప్లవ కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ దుశ్చర్యకు అమెరికా,బ్రిటన్ సామ్రాజ్యవాదుల అండ ఉందని విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం, పాలస్తీనా ప్రజలకు ఆహారం అందకుండా చేయడం వల్ల వందలాది మంది ఆకలితో మృతి చెందుతున్నారని అన్నారు. నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, పాణి, మల్లన్న, పరిగెల కుమార్, గొర్రె ప్రదీప్, పూలక్క, వెంకటస్వామి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి


మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

సంగెం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జ్ దొంతి దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గంగపుత్ర కమ్యూనిటీలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విఫలమైందని విమర్శించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ఏవిధంగా మోసం చేసిందో ప్రజలకు చెప్పాలన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించి ఓటర్లను చైతన్యపరిచాలని అన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుట్టి కుమారస్వామి, నాయకులు రహమతుల్లా, శేషాద్రి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి



వర్ధన్నపేట : సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎస్సై రాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో స్నేహితులు, బంధువుల పేర్లపై అకౌంట్ క్రియేట్ చేసి వారు చేసినట్లుగా అత్యవసరంగా డబ్బులు సాయం కావాలని, లేదా లాటరీ వచ్చిందని ముందుగా కొంత డబ్బు జమ చేయాలని నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తారని అన్నారు. సైబర్ నేరాల్లో నగదు పోగొట్టుకున్నట్లయితే వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930లో లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అలా చేస్తే పోగొట్టుకున్న డబ్బు సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ కాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పర్వతగిరి : కల్లెడలోని ఆర్డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ జూనియర్ కళాశాల విద్యార్థినులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలికల కబడ్డీ పోటీల విభాగంలో ఆర్డీఎఫ్ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను వారు అభినందించారు.

సీజేఐపై దాడిచేసిన నిందితుడిని శిక్షించాలి


నర్సంపేట: నిరసన తెలుపుతున్న నాయకులు


నెక్కొండ: సమావేశంలో మాట్లాడుతున్న యాకయ్య

నర్సంపేట : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు పంజాల రమేష్, సీపీఎం జిల్లా నాయకుడు కొరబోయిన కుమారస్వామి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ప్రణయ్‌దీప్, కాంగ్రెస్ నాయకుడు గద్ద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం రాజకీయ, వామపక్ష విప్లవ ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదుల ఆధ్వర్యంలో ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎలకంటి రాజేందర్, తిరుపతి, బాలకృష్ణ, వీరస్వామి, కృష్ణ, వెంకటస్వామి, ప్రదీప్‌కుమార్, సారంగపాణి, పూలక్క, మల్లయ్య, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి దేశ చరిత్రలోనే చీకటిరోజు

నెక్కొండ : సీజేఐ గవాయ్‌పై భౌతిక దాడికి పాల్పడటం దేశ చరిత్రలోనే చీకటి రోజు అని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య అన్నారు. ఈ ఘటనపై మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కొంగర సూరాయరావు, మందుల పరమాత్మ, జన్ను రవి, బొల్లెపల్లి శ్రావణ్‌కుమార్, కందిక రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన ఉండాలి


నర్సంపేట : మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

నర్సంపేట : ప్రతీ పౌరుడు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ మధురిమ అన్నారు. నర్సంపేట–3 అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం సందర్భంగా సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ఎలాంటి సమాచారం అయినా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నర్సంపేట సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.రమ, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, టీచర్ బి.శిరీష, అనిల్‌కుమార్, సారయ్య, రాజేష్, శివ, సరోజన, నవ్య, శివాణి, శ్రావణి, రవళి, సుష్మ, ఫర్జానా, రజని, వనిత, రమ, పద్మ, వా ణి, సరస్వతి, ఆయా చంద్రకళ, గర్భిణులు,బాలింతలు,కిశోరబాలికలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణమాసం

పర్వతగిరి : మండలంలోని అన్నారం సర్కిల్ రావూరు గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ మాసం నిర్వహించారు. స్థానికంగా లభించే చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏడ బ్యూటీ దొమ్మటి విజయ అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


వర్ధన్నపేట: ఓదారుస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన ఆనపర్తి యాకయ్య, నల్లబెల్లి గ్రామానికి చెందిన ఇల్లంద మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్యాల దేవేందర్ కుమారుడు సంతోష్ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బుధవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సంతోష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు సురేష్, తూళ్ల రవి, రవీందర్, పాపారావు తదితరులు ఉన్నారు.

విక్రమ్ రెడ్డికి..

రాయపర్తి : మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు విక్రమ్‌రెడ్డిని బుధవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ లేఖ ద్వారా పరామర్శించారు. ఇటీవల విక్రమ్‌రెడ్డి తండ్రి భీష్మారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో ఉత్తరంలో దత్తాత్రేయ ఇలా పంపారు. సన్నూరు గ్రామ సర్పంచ్‌గా భీష్మారెడ్డి ఉన్న సమయంలో తాను ఎంపీగా, కేంద్రకార్మిక శాఖ మంత్రిగా సన్నూరు గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. భీష్మారెడ్డి తనవంతు అందించిన సహకారం మర్చిపోలేనిదన్నారు. గ్రామాభివృద్ధికి భీష్మారెడ్డి చేసిన సేవలను గుర్తు చేశారు.

ఎమ్మెల్యే దొంతికి..


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

నర్సంపేట/నర్సంపేట రూరల్ : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి దొంతి మాధవరెడ్డిని పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ మండల నాయకులు కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల మాధవరెడ్డి,బానోత్ లక్ష్మణ్ నాయక్, అజయ్, శోభన్ బాబు, మాత్యం, సదానందం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన కాంగ్రెస్


నర్సంపేట రూరల్: చెన్నారావుపేటలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి


దుగ్గొండి: చలపర్తిలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పెద్ది మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, ఎన్నికల మండల కన్వీనర్ జక్క అశోక్, పీఏసీఎస్ చైర్మన్ చింతకింది వంశీ, మురహరి రవి, మాజీ జెడ్పీటీసీలు బానోత్ పత్తినాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, కొండవీటి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టాలి..

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పొన్నం మొగిలి తెలిపారు. మండలంలోని చలపర్తి, ముద్దునూరు గ్రామాల్లో కాంగ్రెస్ బాకీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు.పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు శానబోయిన రాజుకుమార్, రేవూరి సురేందర్‌రెడ్డి, తోటకూరి రాజు, ముదరకోల కృష్ణ, కమలాకర్‌రెడ్డి, శ్యాంసుందర్, నల్ల నర్సిరెడ్డి, యుగందర్, పాతుల అజయ్, బొల్లెపల్లి రాము, ఇటికాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీకి ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని రంగాపురం, ఖానాపురంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. వల్లెపు శ్రీనివాస్, బంధారపు శ్రీనివాస్‌గౌడ్, ఆబోతు అశోక్‌యాదవ్, బాబురావు, మచ్చిక అశోక్, పూలునాయక్, తదితరులు పాల్గొన్నారు.


ఖానాపురంలో..

స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండూరులో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తిరిగి పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి, దేశబోయిన ఉపేందర్, కొమ్ము రాజు, పులి సోమయ్య, నేరెళ్లి మహేష్, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

గుండ్రపల్లిలో వైద్యశిబిరం


గుండ్రపల్లిలో సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నెక్కొండ : మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో ఈ నెల 7న ఓ చిన్నారి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటనపై నెక్కొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు స్పందించారు. బుధవారం గ్రామంలో వైద్యశిబిరంతో పాటు జర్వ పీడితుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుమన్ మాట్లాడుతూ.. 2,100 జనాభా ఉందని, 423 ఇళ్లు ఉండగా ఇంటింటా సర్వే నిర్వహించామన్నారు. ఐదుగురు జర్వంతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. డెంగీ కేసు ఒకటి కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు. వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందించామని తెలిపారు.